



బల్దియా బడ్జెట్!
# రూ. 1,040.58 కోట్లు
04

TELTEL/2022/83842

PRABHATA GAMANAM
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

శుక్రవారం 27, మార్చి 2026 | వరంగల్ | సంపుటి :04 | సంచిక :189 | పేజీలు :4 | వెల. 3/-




"తెలంగాణ పల్లెల్లో భూమి అంటే కేవలం ఆస్తి మాత్రమే కాదు.. అది ఒక భావోద్వేగం, ఒక జీవనాధారం. కానీ గత కొంతకాలంగా 'ధరణి' తెచ్చిన సాంకేతిక తలనొప్పులు, రికార్డుల గందరగోళం సామాన్య రైతును కంటిమీద కునుకు లేకుండా చేశాయి. వేలాది ఎకరాల భూమి 'నిషేధిత జాబితా'లో చిక్కుకుపోవడం, సర్వే నంబర్ల తారుమారుతో సామాన్యులు కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్న వేళ.. రేవంత్ సర్కార్ ఒక విప్లవాత్మక పరిష్కారానికి నాంది పలికింది. కేవలం ఒక పోర్టల్ మార్పుతో సరిపెట్టకుండా, భూమి ఉన్న ప్రతి పౌరుడికి భరోసా కల్పించేలా 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' వ్యవస్థను తెరపైకి తెచ్చింది. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే శాఖలను ఒకే గొడుగు కిందకు తెస్తూ.. మనిషికి ఆధార్ ఉన్నట్టే, భూమికి 'భూదార్' అనే సరికొత్త డిజిటల్ గుర్తింపును ఇస్తూ పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టింది. దశాబ్దాల నాటి భూ వివాదాలకు చరమగీతం పాడుతూ, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏప్రిల్ 2వ తేదీ నుంచి రాష్ట్రంలోని ఐదు ఎంపిక చేసిన మండలాల్లో ఈ పైలట్ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మక ప్రయోగానికి సిద్ధం చేస్తోంది."

— ప్రభాత గమనం, హైదరాబాద్

# రైతు కష్టాలకు భూభారతి చెక్

- ధరణి చిక్కుముడుల విప్పేందుకే కొత్త పోర్టల్..
- ఏప్రిల్ 2 నుంచి ప్రయోగాత్మక అమలు
- రిజిస్ట్రేషన్ సమయానికే సర్వే మ్యాప్ జత!
- రాష్ట్రవ్యాప్తంగా 5 మండలా పైలట్ ప్రాజెక్టు..
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే శాఖలు ఇక ఒకే గొడుగు కిందకు..
- పారదర్శకతకు పెద్దపీట వేస్తున్న రేవంత్ సర్కార్
- రైతులకు భూ వివాదాల నుంచి విముక్తి కలిగిస్తాం.. : మంత్రి పొంగులేటి

ప్రతి సర్వే నంబర్‌కు 'భూదార్' గుర్తింపు

2

"తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఏళ్ల నాటి నిరీక్షణపై రేవంత్ సర్కార్ మరోసారి నీళ్లు చల్లింది. పెరిగిన ధరలు, ఆకాశాన్నంటుతున్న జీవన వ్యయాల మధ్య కొత్త వేతనాల కోసం గంపెడాశతో ఎదురుచూస్తున్న లక్షలాది మందికి పీఆర్సీ కమిషన్ గడువు పొడిగింపు నిర్ణయం గొడ్డలిపెట్టులా మారింది. 'అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే పీఆర్సీ ఇస్తాం' అని ఎన్నికల వేళ ఇచ్చిన హామీ.. ఇప్పుడు గడువుల మీద గడువులు మారుతూ నత్తనడకన సాగుతుండటంపై ఉద్యోగ వర్గాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అటు అసెంబ్లీలో ప్రతిపక్షాల నిలదీత, ఇటు ఉద్యోగ సంఘాల వినతులు వెల్లువెత్తుతున్నా.. నివేదిక పేరుతో మరో ఆరు నెలల పాటు (సెప్టెంబర్ 30 వరకు) వాయిదా వేయడం ఉద్యోగుల ఆర్థిక ప్రణాళికలను దెబ్బతీస్తోంది. ద్రవ్యోల్బణం భారంతో సతమతమవుతున్న మధ్యతరగతి ఉద్యోగికి ఈ గడువు పొడిగింపు నిర్ణయం తీరని నిరాశను మిగిల్చింది."

# ఉద్యోగులకు మళ్లీ నిరాశే

- సెప్టెంబర్ వరకు పీఆర్సీ గడువు పొడిగింపు
- నివేదిక రాక.. నిరీక్షణ తప్పక.. పెరిగిన ధరల వేళ పాత జీతాలే దిక్కు
- లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్లకు మరోసారి ఆశాభంగం

— ప్రభాత గమనం, హైదరాబాద్



2

## మధ్యాహ్న భోజనంలోకి ఫిష్ కర్రీ..

- విద్యార్థులకు పోషకాహారం అందించాలి
- అసెంబ్లీ వేదికగా మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడి

2





## ఏసీబీకి చిక్కిన మామడ ఎస్సై

20 వేలు లంచం తీసుకుంటూ పట్టివేత

04

శుక్రవారం
27.03.2026
www.prabhatagamanam.com

PRABHATA GAMANAM ప్రభాత గమనం తెలుగు దినపత్రిక




- ధరణి చిక్కుముడుల విప్పేందుకే కొత్త పోర్టల్..
- ఏప్రిల్ 2 నుంచి ప్రయోగాత్మక అమలు
- ప్రతి సర్వే నంబర్ కూ 'భూదార్'
- రిజిస్ట్రేషన్ సమయానికే సర్వే మ్యాప్ జత!
- రాష్ట్రవ్యాప్తంగా 5 మండలాల్లో పైలట్ ప్రాజెక్టు..
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే శాఖలు ఇక ఒకే గొడుగు కిందకు..
- పారదర్శకతకు పెద్దపీట వేస్తున్న రేవంత్ సర్కార్
- రైతులకు భూ వివాదాల నుంచి విముక్తి కలిగిస్తాం.. : మంత్రి పొంగులేటి

# రైతు కష్టాలకు 'భూభారతి' చెక్

**హైదరాబాద్, ప్రభాత గమనం:**

తెలంగాణ రాష్ట్రంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌లోని లోపాలను సరిదిద్దుతూ, అత్యంత పారదర్శకమైన 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' పోర్టల్‌ను ఏప్రిల్ 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా ప్రారంభించనుంది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సెక్రటేరియట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో స్పష్టతనిచ్చారు.

## ధరణి తప్పుల తడక

పొంగులేటి సమీక్షా సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ ధరణి పోర్టల్ తప్పుల తడకగా మారిందని, ఉన్న సమస్యలు తీర్చకపోగా కొత్త సమస్యలను సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం రెవెన్యూ, సర్వే, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతిని రూపొందించిందని తెలిపారు. ఇది భూలావాదేవీల వివరాలు స్పష్టంగా కనిపించే ఒక పారదర్శక వ్యవస్థ అని ఆయన అభివర్ణించారు.

## ప్రతి భూమికీ ఆధార్ తరహాలో 'భూదార్'

ప్రతి వ్యక్తికి ఆధార్ నంబర్ ఉన్నట్లే, ఇకపై ప్రతి సర్వే నంబర్‌కు 'భూదార్' అనే ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించనున్నట్లు మంత్రి వెల్లడించారు. రిజిస్ట్రేషన్ సమయంలోనే భూమికి సంబంధించిన సర్వే మ్యాప్‌లను జత చేసే విధానాన్ని ప్రవేశపెడుతున్నామని, దీనివల్ల భూ ఆక్రమణలు, వివాదాలకు తావుండదని అన్నారు.

## తొలి విడతగా ఐదు మండలాలు

రాష్ట్రవ్యాప్తంగా ఐదు జిల్లాలలోని ఐదు మండలాలను పైలట్ ప్రాజెక్టు కోసం ఎంపిక చేశారు.

**కోస్గి (నారాయణపేట)**
**అమన్‌గల్ (రంగారెడ్డి)**
**వట్‌పల్లి (సంగారెడ్డి)**
**కూసుమంచి (ఖమ్మం)**
**అశ్వారావుపేట (భద్రాద్రి కొత్తగూడెం)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట మండలాల్లో ఈ కొత్త వ్యవస్థను తొలుత అమలు చేయనున్నారు. ఈ పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే, త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ భూభారతిని విస్తరించి భూ వివాదాలకు శాశ్వత చరమగీతం పాడాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని పొంగులేటి స్పష్టం చేశారు.



# మధ్యాహ్న భోజనంలోకి ఫిష్ కర్రీ..

- విద్యార్థులకు పోషకాహారం అందించాలి
- అసెంబ్లీ వేదికగా మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడి

ప్రభాత గమనం, హైదరాబాద్ : తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో ఇకపై చేపల కూరను కూడా అందించనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గురువారం ప్రకటించారు. శాసనసభలో వివిధ శాఖల పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. విద్యార్థులకు పోషకాహారమివ్వడమే ప్రభుత్వ ధ్యేయమని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో పశుసంపద బలంగా ఉందని, ముఖ్యంగా గుడ్ల ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. విద్యార్థులకు మరింత పౌష్టికాహారాన్ని అందించాలనే ఉద్దేశంతోనే మధ్యాహ్న భోజన పథకంలో చేపలను చేర్చాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇదే సమయంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ, మైనార్టీల విద్య కోసం ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోందని తెలిపారు. చర్చ అనంతరం పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు, మైనార్టీ సంక్షేమ శాఖల పద్దులకు శాసనసభ ఆమోదం తెలిపింది.

# ఉద్యోగులకు మళ్లీ నిరాశే

- సెప్టెంబర్ వరకు పీఆర్సీ గడువు పొడిగింపు
- లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్లకు మరోసారి ఆశాభంగం

హైదరాబాద్, ప్రభాత గమనం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వేతన సవరణ (PRC) ప్రక్రియ మరోసారి వాయిదా పడింది. పదవ వేతన సవరణ కమిషన్ గడువును రేవంత్ రెడ్డి సర్కార్ మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో పెరిగిన జీతాలు అందుతాయని ఆశించిన లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్లకు మరోసారి నిరాశే ఎదురైంది.



## మరో 6 నెలలు వేచి చూడాల్సిందే..

ప్రస్తుత పీఆర్సీ కమిటీ గడువు ఈనెల 31వ తేదీతో ముగియాల్సి ఉంది. అయితే, కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించకపోవడంతో, గడువును సెప్టెంబర్ 30, 2026 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇచ్చిన గడువు ముగిసిన ప్రతిసారీ ఇలాగే పొడిగింపులు జరుగుతుండటంతో ఉద్యోగ వర్గాల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.

## ఎన్నికల హామీ.. నత్తనడకన ప్రక్రియ

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే కొత్త పీఆర్సీని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. కానీ, ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత కూడా ప్రక్రియ నత్తనడకన సాగుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పలుమార్లు ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వాన్ని కలిసి వినతి పత్రాలు సమర్పించినప్పటికీ, కమిటీ నుంచి నివేదిక రాకపోవడంతో నిర్ణయం వాయిదా పడుతూ వస్తోంది.

## అసెంబ్లీలో ప్రతిపక్షాల నిలదీత

ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగింది. "అధికారంలోకి వచ్చి ఇంతకాలం గడుస్తున్నా పీఆర్సీ ఊసే లేదు. నిరుపేద ఉద్యోగుల కడుపు కొడుతున్నారా?" అని బిఆర్ఎస్ నేత హరీష్ రావు అసెంబ్లీలో ప్రశ్నించారు. పరిపాలనాపరమైన కారణాలు, నివేదిక రూపకల్పనలో జరుగుతున్న జాప్యం వల్లే గడువు పెంచాల్సి వచ్చిందని ప్రభుత్వం పేర్కొంటోంది.

## ద్రవ్యోల్బణం భారంతో ఉద్యోగుల ఆవేదన

రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలు, జీవన వ్యయాలతో పాత వేతనాలతో నెట్టుకురావడం కష్టమవుతోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "పెరిగిన ద్రవ్యోల్బణానికి అనుగుణంగా జీతాలు పెరగకపోగా, పీఆర్సీని వాయిదా వేయడం వల్ల ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం" అని ఉద్యోగ సంఘాలు వాపోతున్నాయి.

# పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలి

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో



మహబూబాబాద్ మార్చి 26(ప్రభాత గమనం) : అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. గురువారం డోర్నకల్ మునిసిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడారు..వార్డుల వారీగా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు.బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా ఆదాయాన్ని పెంచుకోవాలని, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని సూచించారు. వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్షించి, అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. సోలార్, ఎలక్ట్రికల్ కుక్కర్లు, ఇండక్షన్ స్టౌల లభ్యత మరియు ధరలపై వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికలు ఉంటే, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీతో కలిసి సూచించారు. ఈ సమావేశంలో డోర్నకల్ మునిసిపల్ కమిషనర్ నిరంజన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



# రాజీనే రాజ మార్గం

- లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి
- ఎస్సై క్రాంతి కిరణ్

కేసముద్రం మార్చి 26(ప్రభాత గమనం): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 28న జరగనున్న లోక్ అదాలత్‌ను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ క్రాంతి కిరణ్ గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. కేసముద్రం మండల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ఒక మంచి అవకాశం లభించిందన్నారు. ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా, రాజీ పడదగ్గ కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని ఎస్ఐ కోరారు.కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గించుకోవడానికి లోక్ అదాలత్ ఉత్తమ మార్గమన్నారు.సివిల్ మరియు రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను ఇరు వర్గాల అంగీకారంతో ఇక్కడే ముగించుకోవచ్చని తెలిపారు.ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు ఈ వేదిక ద్వారా తక్షణ పరిష్కారం లభిస్తుందన్నారు.కోర్టుల్లో కేసులు ఉన్నవారు అనవసరమైన ఖర్చులు, సమయం వృధా చేసుకోకుండా... లోక్ అదాలత్‌లో పాల్గొని తమ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, కేసుల భారం నుండి విముక్తి పొంది, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని తెలిపారు.సవాళ్లకు పోతే ఒకరే గెలుస్తారని, దీంతో మరింత కక్షలు పెరిగే అవకాశం ఉంటుందని అదే రాజీ మార్గం ఎంచుకుంటే ఇరువర్గాలు గెలిచినట్లుగా ఉంటుందని అన్నారు. అందుకే వాది, ప్రతి వాదులు సాధ్యమైనంతవరకు రాజీ మార్గాన్ని ఎంచుకోవాలని ఎస్సై కోరారు.

# సీసీ కెమెరా నిఘాలో మాహమూద్ పట్నం


కేసముద్రం మార్చి 26(ప్రభాత గమనం): మండలంలోని మహమూద్ పట్నం గ్రామంలో గురువారం సిసి కెమెరాలను గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిట్టగడుపుల యాకూబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్సై క్రాంతి కిరణ్ పాల్గొని మాట్లాడారు..గ్రామంలో ఏమైనా దొంగతనాలు లేదా రోడ్డుపై జరిగే ప్రమాదాలను చేసిన వ్యక్తులను గుర్తించడంలో ఇది ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేసిన గ్రామస్తులను అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ అమృత శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, బత్తుల వెంకట మల్లు, బత్తుల తిరుపతి, సిలివేరు లింగయ్య, పిట్టల ఉపేందర్, కాసోజు వెంకటాచారి,కాసోజు విజయ్, సిలువేరు రవీందర్, ముంజాల యాకన్న, కాంభోజు యాకయ్య, కొమురయ్య, జిల్లా నాగరాజు, తొగరి తిరుపతి, పులుగుజ్జ నారాయణ, గుడెల్లి ముత్తయ్య, మందుల ముత్తయ్య, ఏశబోయిన కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.



# యువతకు ఉచిత శిక్షణ..

మహబూబాబాద్ మార్చి 26(ప్రభాత గమనం): ఐ.టి.డి.ఎ, ఏటూరునాగారం ఆధ్వర్యంలో పూర్వ వరంగల్ జిల్లా పరిధిలోని డిగ్రీ పాసైన గిరిజన అభ్యర్థులను ఎంపిక చేసి ఆసక్తి కలిగిన అభ్యర్థులకు కేంద్ర,రాష్ట్ర స్థాయి ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికకై గ్రూప్స్, పోలీస్, బ్యాంకింగ్, రైల్వేస్, యస్.యస్.సి,ఇతర ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన ఫౌండేషన్ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఐ.టి.డి.ఎ., ఏటూరునాగారం ప్రాజెక్టు అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుభవం కలిగిన శిక్షణ సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించడమైనదని శిక్షణ సంస్థలకు ఉండాల్సిన అర్హతలు కనీసం ఐదు సంవత్సరాలు పైన తెలిపిన కోర్సులలో శిక్షణ ఇచ్చిన అనుభవం కలిగి ఉండాలని, గత శిక్షణలో మంచి ఫలితాలు సాధించి ఉండాలని రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసిన అనుభవం కలిగి ఉండాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖతో కలిసి పని చేసిన అనుభవం కలిగి ఉండాలి. టి.డబ్ల్యూ స్టడీ సర్కిల్ (పి.ఈ.టి.సి) హన్మకొండలో శిక్షణ ఇచ్చుటకు ఆసక్తి కలిగి ఉండాలన్నారు. పైన తెలుపబడిన అర్హతలు కలిగి ఉండి స్టడీ సర్కిల్ లో గిరిజన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చుటకు ఆసక్తి గల శిక్షణ సంస్థలు, తమ ప్రతిపాదనలు ఈనెల31 సాయంత్రం 5 వరకు టీడబ్ల్యూ స్టడీ సర్కిల్ (పి.ఈ.టి.సి), హన్మకొండలో సమర్పించాలని తెలిపారు.

# గిరిజన గురుకులాలలో ప్రవేశాలకు నోటిఫికేషన్



మహబూబాబాద్ మార్చి 26(ప్రభాత గమనం): తెలంగాణ రాష్ట్రంలో గల 16 ప్రతిభ గురుకుల పాఠశాలలో (సిఓఈ) 2026–27 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రవేశాల కొరకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రాంతీయ సమన్వయ కర్త పీ.రత్న కుమారి గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల కార్యదర్శి ఆదేశాల మేరకు ఈ వివరాలను వెల్లడించినట్లు తెలిపారు. ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన ఈ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యతోపాటు (ఐఐటి,జెఈఈ,నీట్) వంటి పరీక్షలకు ఉచిత శిక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. దరఖాస్తు చివరి తేదీ 07.04.2026.,పరీక్ష తేదీ ఏప్రిల్.19.2026 ,దరఖాస్తు రుసుము ఉచితం,ఎంపిక విధానం: ప్రవేశ పరీక్షలో కనబరిచిన ప్రతిభ మెరిట్ ఆధారంగా ఉంటుందన్నారు. దరఖాస్తు చేయు విధానం ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత www.tgwries.telangana.gov.in వెబ్ సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.మరిన్ని వివరాలకు 8333800221 ఫోన్ నెంబర్ కు సంప్రదించాలని సూచించారు.

# బాధిత కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

## హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్వింటా బియ్యం అందజేత

కేసముద్రం మార్చి 26(ప్రభాత గమనం): మండలంలోని ఇంటికన్నె గ్రామంలో సోమారపు సాయిలు ఇటీవల మృతిచెందారు.ఈ నేపథ్యంలో గురువారం రోజు హెల్పింగ్ హాండ్స్ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి,మనోధైర్యాన్ని నింపారు. అనంతరం వారికి ఒక క్వింటా బియ్యాన్ని అందజేశారు. ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు ముందుండి సొంత కుటుంబం లెక్క ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు నలమాస సందీప్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సహాయ కార్యదర్శి గంధసిరి మల్లేష్, చిర్ర సాయి, సోమారపు శశివర్ధన్,గ్రామ ప్రజలు సోమారపు ఎల్లయ్య, మిట్టగడుపుల యాకయ్య, బానోత్ యాకూబ్, బానోత్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం
27.03.2026
www.prabhatagamanam.com

PRABHATA GAMANAM ప్రభాత గమనం తెలుగు దినపత్రిక




# గ్రాంట్లపైనే గ్రేటర్ ఆశలు..

## రూ. 1,040.58 కోట్లతో బల్దియా బడ్జెట్!

- సొంత ఆదాయం కంటే ప్రభుత్వ నిధులపైనే భారం..
- 70 శాతం గ్రాంట్ల నుంచే అంచనా
- గత ఏడాది కంటే రూ. 30.9 కోట్లు తగ్గిన బడ్జెట్..
- పన్నుల భారం లేదన్న మేయర్

**వరంగల్, ప్రభాత గమనం :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులే ఆధారంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను రూపొందించింది. బుధవారం మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన జరిగిన కార్పొరేషన్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో రూ. 1,040.58 కోట్ల బడ్జెట్ అంచనాలను బల్దియా అకౌంట్స్ అధికారి శివలింగం ప్రవేశపెట్టగా, పాలక వర్గం ఏకగ్రీవంగా ఆమోద ముద్ర వేసింది.

### గ్రాంట్లపైనే అత్యధిక ఆధారం

ఈ ఏడాది బడ్జెట్‌లో సుమారు 70 శాతం నిధులు గ్రాంట్ల రూపంలోనే వస్తాయని బల్దియా అంచనా వేసింది. మొత్తం రూ. 1,040.58 కోట్లలో సొంత ఆదాయం రూ. 349.18 కోట్లు కాగా, గ్రాంట్ల రూపేణా రూ. 685.20 కోట్లు వస్తాయని లెక్కగట్టారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 515.20 కోట్లు, కేంద్రం నుంచి రూ. 170 కోట్లు వస్తాయని ఆశిస్తున్నారు. గత ఏడాది (రూ. 1,071.48 కోట్లు) కంటే ఈసారి రూ. 30.9 కోట్ల మేర అంచనాలను తగ్గించడం గమనార్హం.

**ఆదాయ వనరుల అంచనా:**

- భవన నిర్మాణ అనుమతులు : రూ. 126.50 కోట్లు
- ఆస్తి పన్నులు: రూ. 112.70 కోట్లు
- స్టాంప్ డ్యూటీ: రూ. 40 కోట్లు
- నల్లా పన్నులు: రూ. 36.27 కోట్లు
- ట్రేడ్ లైసెన్స్ ఫీజులు : రూ. 23.56 కోట్లు
- ఆస్తుల కిరాయి: రూ. 10.10 కోట్లు

**బడ్జెట్ హైలైట్స్:**

- మొత్తం బడ్జెట్: రూ. 1,040.58 కోట్లు
- సొంత ఆదాయం: రూ. 349.18 కోట్లు
- గ్రాంట్లు: రూ. 685.20 కోట్లు (సుమారు 70%)
- గ్రీన్ బడ్జెట్: రూ. 34.91 కోట్లు
- విలీన గ్రామాల అభివృద్ధికి : రూ. 25.43 కోట్లు

### విలీన గ్రామాలు, గ్రీన్ బడ్జెట్ కు ప్రాధాన్యత

బల్దియా తన సొంత ఆదాయంలో 10 శాతం అంటే రూ. 34.91 కోట్లను 'గ్రీన్ బడ్జెట్' కోసం కేటాయించింది. నగరంలో విలీనమైన 42 గ్రామాలతో పాటు మురికివాడలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రూ. 25.43 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో విలీన గ్రామాల్లో రోడ్ల నిర్మాణం (రూ. 12.43 కోట్లు), డ్రైనేజీలు (రూ. 9.75 కోట్లు), తాగునీటి సరఫరా వంటి పనులను చేపట్టనున్నారు.
ప్రజా సౌకర్యాల కోసం కేటాయింపులు:
నగర ప్రజల కనీస అవసరాల కోసం రూ. 2.70 కోట్లు కేటాయించగా, అందులో పారిశుధ్య నిర్వహణకు రూ. 75 లక్షలు, ఓపెన్ జిమ్స్ కోసం రూ. 60 లక్షలు, జంతు వధశాలలకు రూ. 40 లక్షలు, పార్కులు, ఆట స్థలాలకు రూ. 15 లక్షలు ఖర్చు చేయనున్నారు.

### పన్నుల భారం లేదు: మేయర్

బడ్జెట్ ఆమోదం అనంతరం మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. నగర ప్రజలపై ఎలాంటి అదనపు పన్నుల భారం వేయకుండానే ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు స్పష్టం చేశారు. నగరాభివృద్ధికి ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లను సద్వినియోగం చేసుకుంటామని తెలిపారు. కాగా, సమావేశానికి హాజరైన హనుమకొండ కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ను మేయర్ మరియు కార్పొరేటర్లు ఘనంగా సత్కరించారు.

### ఆశ్చర్యపరుస్తున్న అంచనాలు

నగరం రోజురోజుకూ విస్తరిస్తున్నా, కొత్త నిర్మాణాలు పెరుగుతున్నా.. గత ఏడాది కంటే సొంత ఆదాయం కేవలం రూ. 11 కోట్లు మాత్రమే పెరుగుతుందని అంచనా వేయడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవ ఆదాయం పెరిగే అవకాశం ఉన్నా అంచనాలు తగ్గించడంపై విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

# ఏసీబీకి చిక్కిన మామడ ఎస్సై

### 20 వేలు లంచం తీసుకుంటూ పట్టివేత



ప్రభాత గమనం, నిర్మల్ : బాధితుడిచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయకుండా లంచం తీసుకున్న ఎస్సైను ఆదిలాబాద్ యూనిట్ ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిర్మల్ జిల్లా మామడ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న టి.అశోక్ గురువారం ఎస్సై క్వార్టర్‌లో రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు మాటు వేసి పట్టుకున్నారు. ఓ కేసులో వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయకుండా ఉండడానికి ఓ వ్యక్తి ఎస్సైని సంప్రదించగా అందుకు డబ్బులు డిమాండ్ చేయడంతో సదరు వ్యక్తి ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధికారులు వల పన్ని ఎస్సైను పట్టుకున్నారు. విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడినందుకు గాను ఎస్సైపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, ఎస్సైను అరెస్ట్ చేసి కరీంనగర్‌లో హాజరుపరిచామని అధికారులు వివరించారు.



# ఇంధన కొరత లేదు!

### రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

ప్రభాత గమనం, హైదరాబాద్: రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కొరత ఉందంటూ వస్తున్న వార్తలు నిరాధారమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంధన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం తెలంగాణలో రాబోయే 60 రోజులకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని తెలిపారు. గ్యాస్ సిలిండర్ల సరఫరా కూడా ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోందని చెప్పారు. నిన్న ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 484 ట్రక్కుల గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. డిమాండ్‌కు మించి సరఫరా జరుగుతున్నప్పటికీ, ప్రజలు అవసరానికి మించి బుకింగ్స్ చేయడం వల్ల కొంత ఒత్తిడి ఏర్పడుతోందని ఆయన పేర్కొన్నారు. పైప్డ్ నేచురల్ గ్యాస్ (PNG), వాహనాలకు ఉపయోగించే సీఎన్‌జీ సరఫరాలో కూడా ఎలాంటి సమస్య లేదని స్పష్టం చేశారు. ఇంధన సరఫరా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, అవసరానికి తగ్గట్టే ఇంధనం, గ్యాస్ సిలిండర్లు వినియోగించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు.

# నెలకు 2 లక్షల టన్నుల యూరియా ఇవ్వండి

### - కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కోరిన మంత్రి తుమ్మల



ప్రభాత గమనం, హైదరాబాద్ : వానకాలంలో మొదటి మూడు నెలల్లో నెలకు 2 లక్షల టన్నుల చొప్పున యూరియా సరఫరా చేయాలని కేంద్ర మంత్రి జేపీ నడ్డాను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కోరారు. గురువారం రాష్ట్రంలో యూరియా సరఫరా, అవసరాలపై మంత్రి తుమ్మలకు కేంద్ర మంత్రి జేపీ నడ్డా ఫోన్ చేసి మాట్లాడారు. 2026 వానకాలానికి సంబంధించిన యూరియా కేటాయింపులను 10 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 11.50 లక్షల మెట్రి క్ టన్నులకు పెంచాలని తుమ్మల కోరారు. స్పందించిన కేంద్ర మంత్రి దీన్ని దేశ వ్యాప్తంగా అమలుచేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

# గ్రామాల్లో కొత్త రూట్ లకు ఆర్టీసీ బస్సులు : మంత్రి పొన్నం



ప్రభాత గమనం, హైదరాబాద్ : నియోజకవర్గాల వారీగా గ్రామాలకు కొత్త రూట్‌లలో ఆర్టీసీ బస్సులు నడిపేందుకు సుముఖంగా ఉన్నట్టు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాల వారీగా అసెంబ్లీ మీటింగ్ హాల్‌లో మహబూబ్‌నగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల ప్రజాప్రతినిధులతో రెండోరోజు మంత్రి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. వారం రోజుల్లో మహిళా సమాఖ్య సంఘాల నుంచి 350 కొత్త బస్సులు ప్రారంభమవుతాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బస్ స్టేషన్లలో టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఆర్టీసీని విస్తరించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374